సాక్షి
అన్నమయ్య జిల్లా
గురువారం । 15 । ఆగస్టు । 2024
I


క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు
క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని మదనపల్లె సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ అన్నారు. ఆటలు ఆడటం వల్ల మానసికంగా ఉల్లాసంగా ఉంటారన్నారు. -IIలో


ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలి
ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణాను కట్టుదిట్టమైన చర్యలతో అరికట్టాలని జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. -IIలో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)



	కనిష్ఠం	గరిష్ఠం
మొదటిరకం	రూ.190	రూ.260
రెండోరకం	రూ.120	రూ.188

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 426 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)



రకం	కనిష్ఠం	గరిష్ఠం
బైవోల్టిన్	220	220
సీబీ	-	-

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 56.340 కిలోలు

పంద్రాగస్టుకు సర్వం సిద్ధం

● ఏర్పాట్లను పూర్తి చేసిన అధికారులు ● జెండాను ఆవిష్కరించనున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి

అన్నమయ్య జిల్లా రాయచోటి కేంద్రంలోని పోలీస్ పరేడ్ మైదానంలో గురువారం 78వ భారత స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలను నిర్వహించేందుకు జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆధ్వర్యంలో ఏర్పాట్లను పూర్తి చేశారు. వేడుకలకు రాయచోటి పోలీస్ పరేడ్ గ్రౌండ్ ముస్తాబైంది. కార్యక్రమానికి రాష్ట్ర రవాణా, యువజన క్రీడలశాఖా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించనున్నారు.

కార్యక్రమ వివరాలు: ఉదయం 8.55 గంటలకు కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ ఆగమనం, పరేడ్ ద్వారా జనరల్ సెల్యూట్ ప్రదర్శన,

- 8.58 గంటలకు ముఖ్య అతిథిగా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆగమనం,
- 9 గంటలకు జాతీయ పతాకావిష్కరణ
- 9.05 గంటలకు ముఖ్య అతిథి పరేడ్ సందర్శన
- 9.15 గంటలకు మంత్రి సందేశం
- 9.45 గంటలకు పోలీసు కవాతు
- 9.50 గంటలకు స్వాతంత్య్ర సమరయోధుల సన్మాన కార్యక్రమం
- 10 గంటలకు ప్రభుత్వ శకటాల ప్రదర్శన
- 10.30 గంటలకు అగ్నిమాపక శాఖ ప్రదర్శన
- 11 గంటలకు ఎన్‌సీసీ, స్కౌట్స్‌లో పాల్గొనే వారి ఫోటో షూట్
- 11.10 గంటలకు ఉద్యోగులకు ఉత్తమ సేవా సర్టిఫికెట్ల ప్రదానం
- 11.55 ముఖ్య అతిథి వివిధ శాఖల స్టాళ్ల సందర్శన
- 12.05 గంటలకు జాతీయ గీతంతో కార్యక్రమం ముగింపు

-రాయచోటి


పంద్రాగస్టు వేడుకలకు ముస్తాబైన వేదిక

దేశభక్తి ఉట్టిపడేలా వేడుకలు: కలెక్టర్ శ్రీధర్

రాయచోటి: దేశభక్తి ఉట్టిపడేలా స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ పేర్కొన్నారు. బుధవారం పరేడ్‌గ్రౌండ్‌లో జరుగుతున్న ఏర్పాట్లను ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు, జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సాంస్కృతిక కార్యక్రమాలు, శకటాల ప్రదర్శనలు ఏర్పాటు చేయాలని అన్నారు.

బందోబస్తు ఏర్పాట్లు పరిశీలించిన ఎస్పీ

రాయచోటి పోలీస్ పరేడ్ మైదానంలో భద్రత, బందోబస్తు, రియల్ టైం ఫుల్ డ్రెస్ పరేడ్ రిహార్సల్స్‌ను జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్‌నాయుడు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వాహనాల పార్కింగ్ నిర్వహణపై అప్రమత్తంగా ఉండాలని, ట్రాఫిక్‌కు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. పరేడ్ రిహార్సల్స్‌లో భాగంగా జిల్లా ఎస్పీ గౌరవవందనం స్వీకరించారు. అనంతరం కవాతు పరిశీలన వాహనంలో వెళ్లి పోలీసులు, హోంగార్డ్స్‌తో పాటు ఎన్‌సీసీ, స్కౌట్స్, గ్రీన్ కార్ప్స్ విద్యార్థుల కవాతును పరిశీలించారు. ఏఆర్ డీఎస్పీ, జి.చిన్నికృష్ణ, రాయచోటి డీఎస్పీ రామచంద్రరావు, ఆర్ఐలు, పోలీసు మోటారు వాహనాల అధికారి ఎం.పెద్దయ్య, పలువురు సీఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


పోలీస్ పరేడ్ గ్రౌండ్‌ను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ శ్రీధర్


గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

న్యూస్‌రీల్

ప్రశాంతంగా కౌన్సెలింగ్

కడప రూరల్: వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం (జోన్–4) పరిధిలో జరుగుతున్న కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సుల నియామకాల కౌన్సెలింగ్ ప్రశాంతంగా జరుగుతోంది. రెండవ రోజైన బుధవారం 50 మందికి గాను 41 మంది కౌన్సెలింగ్‌కు హాజరయ్యారు. నియామక పత్రాలను అందుకున్నారు. ఈ సందర్భంగా ఆ శాఖ రీజనల్ డైరెక్టర్ డాక్టర్ వై శ్రీనివాసులు మాట్లాడుతూ నిబంధనల మేరకు అర్హులైన వారిని స్టాఫ్ నర్సులుగా ఎంపిక చేశామన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

రాయచోటి (జగదాంబసెంటర్): జిల్లాలో ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం, 1989 అమలు పరచడానికి జిల్లా నిఘా, పర్యవేక్షణ కమిటీ (2024–26) నూతన సభ్యుల నియామకం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ, ఎస్టీకి చెందిన నాన్ అఫిషియల్ అభ్యర్థులు ఐదుగురు, ఇతర కులాలకు చెంది ప్రభుత్వేతర స్వచ్ఛంద సంస్థలు నిర్వహిస్తున్న (ఎన్జీఓ) ముగ్గురు సభ్యులను ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు." షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల అభ్యున్నతికి సామాజిక సేవా దృక్పథం కలిగిన వారై ఉండాలి. ఒక వ్యక్తి రెండు పర్యాయాలు మాత్రమే జిల్లా నిఘా, పర్యవేక్షణ కమిటీ సభ్యునిగా ఎన్నికయ్యేందుకు అర్హులు. ఇది వరకు చేపట్టిన సాంఘికసేవా కార్యక్రమ వివరాలు, తగిన ఆధారాలు, బయోడేటాతో జతపరిచి జిల్లా షెడ్యూల్డ్ కులాలు, సంక్షేమ, సాధికారత అధికారి, అన్నమయ్య జిల్లా కార్యాలయానికి ఈ నెల 23వ తేదీలోగా సమరించాలని తెలిపారు.

'క్యాంపస్' ద్వారా ఉద్యోగాలు

వేంపల్లి: ఇడుపులపాయ ఆర్కేవ్యాలీ ట్రిపుల్ ఐటీలో మెకానికల్ ఇంజనీరింగ్ పూర్తి చేసుకున్న విద్యార్థులకు క్యాంపస్ ఇంటర్వ్యూల ద్వారా ఉద్యోగాలు లభించినట్లు డైరెక్టర్ కుమారస్వామిగుప్తా తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రముఖ హ్యూందాయ్ మోటార్ ఇండియా ఆర్అండ్‌డీ విభాగంలో గ్రాడ్యుయేట్ ఇంజనీర్ ట్రైనీగా విద్యార్థులు నిహారిక, ఉదయ్, హేమంత్ నియమితులయ్యారన్నారు. గత మార్చినెలలో ఆర్కేవ్యాలీ ట్రిపుల్ ఐటీలో జరిగిన ప్రాంగణ ఎంపికల ద్వారా ఇంటర్న్ షిప్ సాధించి, మూడు నెలల తర్వాత జీఇటిగా నియమితులైనట్లు డైరెక్టర్ వెల్లడించారు. వీరి ఎంపికపై డైరెక్టర్‌తో పాటు పరిపాలన అధికారి రవికుమార్, అకాడమిక్ డీన్ రత్నకుమారి హర్షం వ్యక్తం చేశారు.

శాస్త్రవేత్తలుగా ఎదిగేలా ప్రోత్సహించాలి



మాట్లాడుతున్న డీఈఓ శివప్రకాష్‌రెడ్డి

రాయచోటి (జగదాంబసెంటర్): ఇన్‌స్పైర్ మనాక్ వేదికను ఉపయోగించుకుని విద్యార్థులు బాల శాస్త్రవేత్తలుగా ఎదగడానికి ప్రోత్సహించాలని జిల్లా విద్యాశాఖాధికారి శివప్రకాష్‌రెడ్డి పేర్కొన్నారు. రాయచోటి డైట్ కళాశాలలో జిల్లా సైన్స్ అధికారి మార్ల ఓబుల్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ఇన్‌స్పైర్ మనాక్ శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.పాఠశాలలో విద్యార్థుల మధ్య ప్రాజెక్టుల పోటీలు నిర్వహించాలని తెలిపారు. జిల్లాలోని ప్రతి ప్రాథమికోన్నత పాఠశాల నుంచి మూడు, ఉన్నత పాఠశాల నుంచి ఐదు నామినేషన్లు తప్పనిసరిగా సమర్పించాలన్నారు. నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ వారు వినూత్న ప్రాజెక్టులను మాత్రమే ఎంపిక చేసి రూ.10 వేల అవార్డును ప్రకటిస్తారన్నారు. డైట్ ఇన్‌చార్జి ప్రిన్సిపల్ అజయ్‌కుమార్‌బాబు మాట్లాడుతూ సమాజ శ్రేయస్సు కోసం విద్యార్థుల్లో శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంపొందించాలని అన్నారు. ఈ కార్యక్రమానికి శివలక్ష్మీ, మధుసూధన్‌రాజు, రాజేంద్రప్రసాద్ రీసోర్స్‌పర్సన్లుగా వ్యవహరించారు. మండల విద్యాశాఖ అధికారి బాలాజీ పాల్గొన్నారు.

నాడి పట్టే నాథులేరీ?

అధునాతన వసతులు సమకూరుతున్నా..అందమైన భవనాలు ఒనగూరినా ఇంకా రాయచోటిలో నాణ్యమైన వైద్యానికి ప్రజలు అర్రులు చాస్తున్నారు. రోగికి నాడి పట్టి వైద్యం అందించేందుకు స్పెషలిస్టులు లేకపోవడంతో సమస్య మొదటికొస్తోంది. ప్రతినిత్యం పట్టణంతోపాటు చుట్టుపక్కల పల్లెల నుంచి వచ్చిన రోగులతో ఆస్పత్రి కిటకిటలాడుతూ ఉంటుంది. రాయచోటిలోని వంద పడకల ఆస్పత్రిని సాక్షి బృందం విజిట్ చేసిన నేపథ్యంలో అనేక సమస్యలు వెలుగులోకి వచ్చాయి.

- వంద పడకల ఆస్పత్రిగా మారినా ఒనగూరని సౌకర్యాలు
- రాయచోటి ఆస్పత్రిలో రోగులకు తప్పని తిప్పలు
- కానరాని స్పెషలిస్టు వైద్యులు
- ప్రమాదం జరిగి కాలు, చేయి విరిగినా అందని అత్యుత్తమ వైద్యం
- ఓపీ, ఫార్మసీ, ల్యాబ్‌ల వద్ద రోగులకు తప్పని గంటల తరబడి నిరీక్షణ
- ఆపరేషన్ థియేటర్లలో పరికరాల కొరత
- నాణ్యమైన వైద్యంపై పెదవి విరుస్తున్న రోగులు


రాయచోటి ఆస్పత్రిలో వైద్యం కోసం వేచి ఉన్న రోగులు

సాక్షి రాయచోటి/రాయచోటి/రాయచోటి టౌన్/ సంబేపల్లె: అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటిలోని బస్టాండుకు సమీపంలో ఉన్న ఆస్పత్రిని 100 పడకల పెద్దాస్పత్రిగా మార్చారు. నూతన హంగులతో ఆస్పత్రి నిర్మాణం అద్భుతంగా కనిపిస్తోంది. అయితే ఆస్పత్రిలో కొన్ని పనులు పెండింగ్‌లో ఉన్నాయి. ఆపరేషన్ థియేటర్‌కు సంబంధించి వసతుల కొరత వెంటాడుతోంది. మహిళలకు సిజేరియన్లు, ఇతర చిన్నపాటి ఆపరేషన్లు జరుగుతున్నా ఆపరేషన్ థియేటర్‌లో లైట్లు, టేబుళ్లు, ఇతర సర్జికల్ పరికరాల కొరత పట్టి పీడిస్తోంది. 50 ఎల్‌పీఎం కెపాసిటీ ఉన్నా అప్పటికప్పుడు అవసరాలకు వినియోగించేలా ఉత్పత్తి చేసుకునే వీలు ఉంది. ఆస్పత్రిలోని కొన్ని విభాగాల్లో ఇప్పటికీ దుమ్ము ధూళి వెంటాడుతోంది. మంచినీటికి సంబంధించి ఆస్పత్రికి వచ్చిన రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్లాంటు నెలకొల్పారేగానీ, అక్కడి నుంచి ఆస్పత్రిలోకి పైపులైన్ నిర్మాణం చేపట్టకపోవడంతో ఇబ్బందిగా మారింది.

భరించలేని కష్టంగా ఉంటుంది



నా పేరు రెడ్డెన్న మాది బండపల్లె, వారానికి మూడు సార్లు డయాలసిస్ చేయించుకోవాలి. లేకపోతే చాలా కష్టంగా ఉంటుంది. భరించలేని కష్టంగా ఉంటుంది. ఇక్కడ ఉదయం నుంచి ఉన్నాను. ఎక్కువ మంది వస్తుడటంతో మా వరుస వచ్చేటప్పటికీ సమయం పడుతోంది. దీని స్థాయితో పాటు మిషనరీలు పెంచి మరో పెద్ద గది ఏర్పాటు చేస్తే ఇలా గంటల తరబడి వేచి చూడాల్సిన అవసరం లేదు.

అత్యవసర పరిస్థితి వస్తే అంతే..

రాయచోటిలోని ఆస్పత్రికి సంబంధించి ప్రమాద బాధితుల పరంగా అత్యవసర పరిస్థితులు వస్తే అంతే సంగతులు. ఎందుకంటే చుట్టు పక్కల ప్రాంతాల్లో రోడ్డు, గ్యాస్, అగ్నిప్రమాద బాధితులు, అత్యవసరంగా ప్రమాదంలో చిక్కుకున్న వారు వస్తే ఇక్కడ అత్యున్నత వైద్య సేవలు అందించే పరిస్థితి లేదు. ఎందుకంటే ఇక్కడ ట్రామా కేర్ సెంటర్ లేకపోవడంతో సీఆర్మ్ మిషన్ లేకపోవడంతో అత్యవసర పరిస్థితుల్లో ప్రమాద బాధితులకు వైద్యం అందించేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ ఆస్పత్రిలో 24 మంది వైద్యులు పనిచేస్తుండగా, అందులో 8 మంది సివిల్ సర్జన్లు కాగా, మిగిలిన 16 మంది సివిల్ అసిస్టెంట్ సర్జన్లుగా ఉన్నారు. ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో వచ్చినా వైద్యులు చేతనైనంత వరకు వైద్య సేవలు అందిస్తున్నా కీలకమైన పరికరాల కొరత నేపథ్యంలో తిరుపతి, కడప, బెంగళూరులకు రెఫర్ చేయాల్సిన పరిస్థితి నెలకొంది. అంతేకాకుండా ఆస్పత్రి చుట్టూ ప్రహరీ లేకపోవడంతో పందుల బెడదతోపాటు అపరిశుభ్రత వాతావరణం నెలకొంది. ఆస్పత్రి లోపల ఓపీ వద్ద రోగులకు సంబంధించి కనీసం ఫ్యాన్ వసతి సైతం లేదని కొందరు రోగులు పెదవి విరుస్తున్నారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారు వైద్యం చేయించుకుని ఇంటికి వెళ్లడానికి ఇష్టపడుతున్నారు. అత్యవసరమై ఉండాల్సి వస్తే సాయంత్రానికి ఇంటివైపు పయనమవుతున్నారు.

పెద్దాస్పత్రిలో సీటీ స్కానర్ కొరత

రాయచోటిలోని 100 పడకల ఆస్పత్రిలో సీటీ స్కానర్ ఏర్పాటు చేయలేదు. పెద్దాస్పత్రిగా అప్‌గ్రేడ్ చేశారు. కానీ సీటీ స్కానర్ లేకపోవడంతో అటు కడప, ఇటు తిరుపతి ప్రాంతాలకు వెళ్లి స్కానింగ్ చేయించుకోవాల్సిన పరిస్థితులు తలెత్తుతున్నాయి. ఎంఆర్ఐ లేకపోయినా కనీసం సీటీ స్కానింగ్ ఉన్నా కూడా ఎంతో కొంత పేద రోగులకు ఉపశమనంగా ఉంటుంది. బయట ల్యాబ్‌లలో చేయించుకోవాలంటే వేలాది రూపాయలు చెల్లించాల్సిన పరిస్థితి. దీంతో పేద వర్గాలకు కష్టంగా మారుతోంది.

కౌంటర్ల వద్ద తప్పని నిరీక్షణ

రాయచోటిలోని ప్రధాన ఆస్పత్రికి రాయచోటి పట్టణంతోపాటు చుట్టు పక్కల ప్రాంతాల నుంచి ప్రతిరోజు సుమారు 800 మంది రోగులు వస్తున్నారు. అనేక రకాల వ్యాధులతో బాధపడుతున్న వారు ఆస్పత్రి వరకు వరకు రావడం ఒక ఎత్తయితే, కౌంటర్ల వద్ద వీరికి నిరీక్షణ ఎదురవుతోంది. ఓపీ, ల్యాబ్, ఫార్మసీ, వైద్యులకు సంబంధించి కొన్ని కౌంటర్ల వద్ద కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

100	రాయచోటి జిల్లా ఆస్పత్రిలో పడకలు
800	ప్రతిరోజు ఆస్పత్రికి వచ్చే రోగులు:
250	సాక్షి విజిట్ రోజు సాధారణ జబ్బులతో వచ్చిన మహిళలు
328	వివిధ వ్యాధులతో వచ్చిన పురుషులు
83	అనేక రకాల వ్యాధులతో ఆస్పత్రికి వచ్చిన చిన్నారులు
97	దీర్ఘకాలిక వ్యాధులతో వచ్చిన వారు
24	ఆస్పత్రిలో పనిచేస్తున్న వైద్యులు
30	విధులు నిర్వహిస్తున్న నర్సింగ్ సిబ్బంది
60	పారిశుధ్యం, ఇతర సిబ్బంది

తాగునీటి వసతి కల్పించాలి



నేను ఆయాసంతో బాధపడుతున్నాను. వైద్యం కోసం ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చాను. డాక్టర్లు పరీక్ష చేసి మందులు ఇచ్చారు. మందు బిళ్లలు మిగుతామంటే తాగేందుకు చుక్క నీరు కూడా లేదు. తాగునీరు ఏర్పాటు చేస్తే బాగుంటుంది. అధికారులు దీనిపై చర్యలు తీసుకోవాలి.లేదంటే మాలాంటి వృద్ధులు ఇబ్బంది పడతారు. – ఆదెన్న, నక్కవాండ్లపల్లె

నాణ్యమైన మందులు ఇవ్వాలి



రెండు రోజులుగా ఒళ్లంతా తీవ్రమైన నొప్పులుగా ఉన్నాయి. ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చాను. వైద్యం చేశారు కానీ నొప్పులు తగ్గలేదు. ఆస్పత్రుల చుట్టూ తిరగాలంటే ఇబ్బందిగా ఉంది. నాణ్యమైన వైద్యం అందించి.. రోగం నయం చేసే మంచి మందులిస్తే బాగుంటుంది.
–నాగలక్ష్మి, మాసాపేట రెడ్డివారిపల్లె, రాయచోటి మండలం

రోగులకు మెరుగైన వైద్యం



రోగులకు మెరుగైన అందిస్తున్నాం. ఆసుపత్రిలో రోగులకు కావాల్సిన మందులు ఉన్నాయి. చికిత్సలు అందించడానికి తగినంత మంది వైద్యులు ఉన్నారు. ప్రమాదాల కారణంగా ఆసుపత్రికి వచ్చిన వారికి ప్రాథమిక చికిత్స అనంతరం కడప, తిరుపతి ఆసుపత్రులకు రెఫర్ చేస్తున్నాం.
– డాక్టర్ డేవిడ్ సుకుమార్, సూపరింటెండెంట్, రాయచోటి ఆస్పత్రి


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులు



ఆస్పత్రిలోని ప్రాణవాయువు ఉత్పత్తి కేంద్రం


మదనపల్లె: వృథాగా ఉన్న టీబీ సీనాట్ యంత్రం


మదనపల్లె: ర్యాంపు లేక వృద్ధులకు అవస్థలు

పేరుకే పెద్ద.. సేవల్లో చిన్న..

మదనపల్లె ఆసుపత్రిలో కీలక విభాగాల్లో వైద్యులు కరువు

మదనపల్లె: నాలుగు వందల పడకల సామర్థ్యం.. 20 వార్డులు....నిత్యం 1000 నుంచి 1,200 వరకు నమోదవుతున్న ఓపీలు.. నెలలో కనీసం 300 ప్రసవాలు.. చుట్టుపక్కల నియోజకవర్గాలతో పాటు పట్టణ ప్రజలకు 24 గంటలు వైద్యసేవలు అందిస్తున్న మదనపల్లె సర్వజన బోధనాసుపత్రి.....పేరుకే పెద్దగా ఉన్నప్పటికీ సేవల్లో చిన్న ఆస్పత్రిగా కొనసాగుతోంది. ఆస్పత్రిలో కీలకవిభాగాలకు వైద్యులు లేకపోవడం, అత్యవసర పరిస్థితులకు చికిత్సలు అందించేందుకు అనువైన సౌకర్యాలు లేకపోవడంతో తిరుపతికి రెఫర్ చేస్తున్నారు. ఇక్కడి నుంచి 110 కిలోమీటర్ల దూరంలో ఉన్న తిరుపతికి వెళ్లేలోపు మార్గమధ్యంలోనే ప్రాణాలు కోల్పోయిన అభాగ్యులు ఎందరో ఉన్నారు. దీనికితోడు లక్షలు ఖర్చుచేసి కొనుగోలు చేసిన యంత్రాలకు చిన్న రిపేరీలు వస్తే, వాటికి మరమ్మతులు చేయించక మూలనపడేస్తున్నారు. దీంతో ఆ సేవలకు వచ్చే రోగులు తిరిగి ప్రైవేట్ ఆస్పత్రులు, ల్యాబ్‌లు, స్కాన్ సెంటర్లపై ఆధారపడి డబ్బులు ఖర్చుచేయాల్సి వస్తోంది. ఆస్పత్రిలో 400 పడకలకు ...32 మంది నర్సింగ్ సిబ్బంది, 25 మంది పారిశుధ్య కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు. సర్వజన బోధనాసుపత్రిలో మొత్తం 50 విభాగాలకు 484 ఖాళీలకు 160 మంది విధులు నిర్వహిస్తున్నారు. నర్సింగ్ విభాగంలో 168 ఖాళీలు, జనరల్ డ్యూటీ అసిస్టెంట్‌లు 31 ఖాళీలు, హెడ్‌నర్స్ ఖాళీలు..14, జూనియర్ అసిస్టెంట్‌లు..10, ఎమర్జెన్సీ మెడిసిన్ టెక్నీషియన్స్ 34 ఖాళీలు ఉన్నాయి. కీలకమైన కార్డియాలజీ, యూరాలజీ, పల్మనాలజీ, ఎండోక్రినాలజీ, గ్యాస్ట్రో ఎంటరాలజీ తదితర విభాగాలకు వైద్యులు లేరు. స్కానింగ్ విభాగానికి సంబంధించి సీటీ స్కాన్, ఎంఆర్ఐ స్కాన్ లేకపోవడంతో ప్రైవేట్ ల్యాబ్‌లను ఆశ్రయించాల్సి వస్తోంది. బోధనాసుపత్రిలో పై అంతస్తులో ఉన్న విభాగాలు, పురుషుల వార్డుకు వెళ్లేందుకు ర్యాంపు సౌకర్యం లేకపోవడంతో రోగులు, అటెండర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



మదనపల్లె ప్రభుత్వ సర్వజన బోధన ఆసుపత్రి

మదనపల్లె సర్వజన బోధనాసుపత్రిలో ఖాళీల వివరాలు

నర్సింగ్ విభాగం:	168
జనరల్ డ్యూటీ అసిస్టెంట్‌లు:	31
హెడ్‌నర్స్‌లు:	14
జూనియర్ అసిస్టెంట్‌లు:	10
ఎమర్జెన్సీ మెడిసిన్ టెక్నీషియన్స్:	34

మరుగుదొడ్ల సంఖ్య పెంచాలి



భార్య రెండో కాన్పు కోసం ఆస్పత్రికి వచ్చాం. కాన్పుల వార్డులో బాలింతలకు సంబంధించి ఒకే మరుగుదొడ్డి ఉండటంతో వారంరోజుల పాటు ఇబ్బందులు పడ్డాం. స్త్రీలు, బాలింతల వార్డుల్లో మరుగుదొడ్లు మరిన్ని పెంచాలి. – చలపతి, మల్లెల పంచాయతీ, బి.కొత్తకోట మండలం

క్లుప్తంగా

మంత్రి మండిపల్లి స్వాతంత్య్ర దినోత్సవ శుభాకాంక్షలు


మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి

రాయచోటి: రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ప్రజలకు 78వ స్వాతంత్య్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. స్వాతంత్య్ర సమరయోధుల అడుగు జాడల్లో ప్రతి ఒక్కరూ నడిచి దేశాభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. వీరుల ప్రాణ త్యాగాలతో నిర్మితమైన మనదేశం మహోజ్వలంగా ఎదగాలని ఆకాంక్షించారు. స్వాతంత్య్ర ఫలాలు ప్రతి ఒక్కరికీ దక్కి దేశం, రాష్ట్రం అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలన్నారు.

'108'కు మరమ్మతులు


108కి నూతన అద్దం అమర్చిన దృశ్యం

సాక్షి ఎఫెక్ట్..

వాల్మీకిపురం : రోగులను ఆస్పత్రికి తరలించే 108 వాహనం దుస్థితి వివరించేలా బుధవారం సాక్షిలో ప్రచురితమైన 'వాహనం పాడైంది.. పోస్టర్ అడ్డుపడింది' చిత్ర కథనానికి అధికారులు స్పందించారు. ఉన్నతాధికారులు వాహనాన్ని పరిశీలించి వెంటనే అద్దం అమర్చారు.

రాజ్ భవన్ నుంచి ఆహ్వానం


పూల నాగరాజు

పెద్దతిప్పసముద్రం : స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా పెద్దతిప్పసముద్రానికి చెందిన పూల నాగరాజుకు ఏపీ రాజ్ భవన్ నుంచి ఆహ్వానం అందింది. అన్నమయ్య జిల్లా పెద్దతిప్పసముద్రానికి చెందిన పూల నాగరాజు గతంలో అంతర్జాతీయ స్థాయిలో జరిగిన క్రీడా పోటీల్లో ప్రతిభ చాటి రజత పతకాలు అందుకున్నారు. ఈ విషయాన్ని ఇటీవల నాగరాజు అన్నమయ్య జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా కలెక్టర్ సదరు లేఖను రాష్ట్ర గవర్నర్ కార్యాలయానికి సిఫారసు చేశారు. ఈ నేపథ్యంలో స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా గురువారం విజయవాడలోని ఏపీ రాజ్ భవన్‌లో జరిగే సన్మాన, విందు కార్యక్రమానికి నాగరాజు హాజరు కావాలని స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి ఉత్తర్వులు అందాయి. నాగరాజు తెలంగాణ రాష్ట్రంలోని కరీంనగర్ జిల్లా రామగుండం డివిజన్ సింగరేణి ఏరియా ఆసుపత్రిలో చీఫ్ రేడియోగ్రాఫర్‌గా పని చేసి ఉద్యోగ విరమణ పొందారు.

ఎర్రకోట వేడుకకు కోడూరు దంపతులు


అల్లాబకష్, ఆలియా

రైల్వేకోడూరు అర్బన్ : నేడు ఢిల్లీ ఎర్రకోటలో జరిగే స్వాతంత్య్ర వేడుకల్లో పాల్గొనేందుకు రైల్వేకోడూరు మండలం శెట్టిగుంటకు చెందిన అల్లాబకష్, ఆలియాలకు ప్రధాన మంత్రి కార్యాలయం నుంచి ఆహ్వానం అందినట్లు జిల్లా ప్రణాళికా విభాగం కో-ఆర్డినేటర్ చిన్నయ్య తెలిపారు. ఇరువురూ దేశ రాజధానికి వెళ్లారని ఆయన పేర్కొన్నారు. వీరిని పీఎంఏవై గ్రామీణ గృహనిర్మాణాన్ని వినియోగించుకున్నందుకు ఎంపిక చేశారన్నారు.

పరువు హత్యనా? ఆత్మహత్యనా?

- తంబళ్లపల్లెలో బాలిక అనుమానాస్పద మృతి
- కుళ్లిన స్థితిలో ఉండటంవల్లే మృతదేహాన్ని కాల్చేశారు
- ఫోరెన్సిక్ పరీక్షకు బూడిద, ఎముకల సేకరణ
- ఈ ఘటనకు ముందు తంబళ్లపల్లెలో అదృశ్యం కేసు నమోదు
- వరుసకు సోదరుడైన వ్యక్తితో ప్రేమ వ్యవహారం విషాదాంతం


మృతదేహాన్ని దహనం చేసిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న పోలీసులు


బాలిక ఉరివేసుకున్న చెట్టును పరిశీలిస్తున్న ఎస్ఐ, పోలీసులు


మృతురాలు (ఫైల్)

బి.కొత్తకోట : అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లె నియోజక వర్గం పెద్దమండ్యం మండలంలో అనుమానాస్పద స్థితిలో చెట్టుకు ఉరివేసుకుని కనిపించిన 17 ఏళ్ల బాలిక ఘటన పరువు హత్యానా లేక ఆత్మహత్యనా అన్నది ప్రశ్నార్థకంగా మారింది. ప్రేమించుకున్న వారి కులాలు, మతాలు వేరయితే..అది తల్లిదండ్రులకు ఇష్టంలేక ఏదైనా చర్యకు పాల్పడితే దాన్ని పరువు హత్యగానో ఇంకోలాగో చెప్పుకుంటాం. అయితే ఈ బాలిక ప్రేమించిన వ్యక్తి ఒకే కులానికి చెందిన యువకుడే. అయితే వారిద్దరిదీ సోదరీ, సోదరుల వరుస అవుతుంది. మృతదేహాన్ని కాల్చివేయడం ద్వారా అనుమానాలు వ్యక్తం కావడంతో తంబళ్లపల్లె పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కుటుంబీకులు, స్థానికులు, పోలీసుల కథనం మేరకు..

వరుసకు సోదరుడితో..

ఓ నిరుపేద కుటుంబంతంబళ్లపల్లె మండలం ఎగువబోయపల్లెలో నివాసముంటోంది . భార్యతో కలిసి కూలిపనులకు వెళ్తేకాని పూట గడవని స్థితి. ఈ పల్లెలో బోయ సామాజిక వర్గానికి చెందిన సుమారు 90 కుటుంబాల వారు నివసిస్తున్నారు. వీరిలో దాయాది కుటుంబాలు, ఒకే కుటుంబం నుంచి వేరు పడిన కుటుంబాలున్నాయి. కూలి పనులకు వెళ్లే ఓ వ్యక్తికి 17 ఏళ్ల కుమార్తె ఉంది. ఆమె, వరుసకు సోదరుడైన యువకుడు ప్రేమించుకుంటున్నారు. ఈ నేపథ్యంలో బాలిక తండ్రి తన కుమార్తెకు వివాహం చేయాలనే ప్రయత్నాల్లో ఉండగా గతనెల 22న అదృశ్యమైంది. తంబళ్లపల్లె పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సోదరుడి వరుసైన యువకుడితో కలిసి వెళ్లినట్టు కుటుంబీకులు అనుమానంతో వెతకగా ఈ నెల 8న ఆచూకీ లభ్యమై బాలికను తీసుకొచ్చారు. తహసీల్దార్ కార్యాలయంలో అధికారుల ఎదుట హాజరుపర్చి కుటుంబీకులకు అప్పగించారు. ఇంతటితో కథ సుఖాంతమైందని భావించారు.

తల్లితో బయటకొచ్చి..

ఈనెల 8వ తేదీ గురువారం రాత్రి ఇంట్లోనే ఉన్న బాలిక మరుసటిరోజు 9వ తేదీ శుక్రవారం ఉదయం బహిర్భూమికి వెళ్లాలని తల్లితో చెప్పగా ఆమె తోడుగా గ్రామ శివారులోకి వెళ్లగానే తల్లిని వదిలి పరుగెత్తి వెళ్లిపోయింది. కుమార్తె వెంట పరుగు తీయలేని తల్లి గ్రామానికి వచ్చి విషయం చెప్పడంతో బంధువుల యువకుడితో కలిసి వెళ్లి ఉంటుందని భావించి అతని కోసం ఆరా తీయగా ఇక్కడే ఉన్నట్టు నిర్ధారించుకున్నారు. దీనిపై గ్రామస్తులు సోదరి, సోదరుల వరుస కలిగి ప్రేమించుకోవడం సమంజసం కాదని సదరు యువకుడికి సూచించి వారి బంధం కొనసాగించవద్దని కోరారు.

శవమై కనిపించి..

తల్లితో కలిసి ఇంటినుంచి వెలుపలికి వచ్చి పరారైన బాలిక స్వగ్రామం ఎగువబోయపల్లెకు రెండు కిలోమీటర్ల దూరంలోని పెద్దమండ్యం మండలం బండ్రేవు పంచాయతీలోని నల్లగుట్ట అడవిలోని చెట్టుకు శవమై వేలాడుతూ సోమవారం సాయంత్రం (12వ తేదీ) గొర్రెలకాపరులకు కనిపించింది. విషయం తెలుసుకున్న కుటుంబీకులు, బంధువులు మంగళవారం మృతదేహాన్ని అడవిలోనే కట్టెలు పేర్చి అంత్యక్రియలు నిర్వహించి దహనం చేశారు. శ్వేత శుక్రవారమే పరారై అదేరోజు ఆత్మహత్యకు పాల్పడి ఉంటుందని, నాలుగురోజులు మృతదేహం కుళ్లి దుర్వాసన వస్తుండటం, పురుగులు పట్టడంతో ఇంటికి తీసుకొచ్చే పరిస్థితి లేక అక్కడే దహనం చేశారని అంటున్నారు. ఈ కార్యక్రమానికి పదిమంది వరకు హాజరైనట్టు పోలీసులు భావిస్తున్నారు. కాగా మంగళవారం సాయంత్రం ఈ ఘటనపై బండ్రేవు వీఆర్ఏ వేణుగోపాల్ వీఆర్ఓ పక్కీర్ షావలీకి చెప్పడంతో ఆయన పెద్దమండ్యం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశామని ఎస్ఐ బి.వెంకటశివ చెప్పారు.

హత్యా..ఆత్మహత్యా..

బాలిక మృతి ఘటనపై బుధవారం ఎస్పీ విద్యాసాగర్ నాయుడు స్పందించి వివరాలు తెలుసుకున్నారు. సత్వరమే కేసు చిక్కుముడి విప్పాలని డీఎస్పీని ఆదేశించారు. దీంతో డీఎస్పీ రెడ్డయ్యనాయుడు, సీఐ మధులు కేసును వివిధ కోణాల్లో విచారిస్తున్నారు. ప్రాథమికంగా బాలిక మరణం ఆత్మహత్యే అని గ్రామస్తులు భావిస్తున్నప్పటికీ పోలీసులు అనుమానాలతో దర్యాప్తును ముందుకు తీసుకెళ్తున్నారు. ఆధారాల సేకరణ, సాంకేతిక వివరాలను పరిశీలిస్తున్నారు. మృతదేహం దహనం చేయడంతో బూడిద, ఎముకలను సేకరించిన పోలీసులు వాటిని ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపుతున్నారు. బాలిక ఉరి వేసుకున్నట్టుగా భావిస్తున్న చెట్టును పోలీసులు నిశితంగా పరిశీలించారు. పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది.

కడపకు చేరుకున్న మంత్రి ఫరూఖ్


మంత్రి ఫరూఖ్‌తో చర్చిస్తున్న కలెక్టర్, ఎస్పీ

కడప సెవెన్‌రోడ్స్ : దేశ 78వ స్వాతంత్య్ర వేడుకల్లో భాగంగా కడపలో జరిగే వివిధ కార్యక్రమాల్లో పాల్గొనే నిమిత్తం రాష్ట్ర మైనార్టీశాఖ మంత్రి ఫరూఖ్ బుధవారం రాత్రి కడపకు చేరుకున్నారు. స్థానిక స్టేట్ గెస్ట్ హౌస్ వద్ద మంత్రికి కలెక్టర్, జిల్లా ఎస్పీ స్వాగతం పలికారు. అనంతరం వారు పలు అంశాలపై చర్చించారు. అలాగే మంత్రిని కలిసిన వారిలో జాయింట్ కలెక్టర్ అదితి సింగ్, జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు, డీఆర్వో గంగాధర్ గౌడ్, మైనారిటీ కార్పొరేషన్ ఈడీ డాక్టర్ వల్లూరి బ్రహ్మయ్య, జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి ఇమ్రాన్, టీడీపీ నేతలు అమీర్ బాబు, గోవర్ధన్ రెడ్డి, హరిప్రసాద్, జిల్లా అధికారులు ఉన్నారు.

ప్లైయాష్ ట్యాంకర్లను అడ్డుకుని ఆందోళన

ఎర్రగుంట్ల : ప్లైయాస్ దుమ్ముతో చాలా ఇబ్బంది పడుతున్నామని మండలంలోని చిలంకూరు గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేశారు. ఆర్టీపీపీ నుంచి వస్తున్న ప్లైయాస్ ట్యాంకర్లను చిలంకూరు గ్రామస్తులు బుధవారం అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి రోజూ ఆర్టీపీపీ నుంచి ప్లైయాస్ ట్యాంకర్లు, టిప్పర్లు గ్రామంలో తిరుగుతున్నాయనన్నారు.ప్లైయాస్ దుమ్ము విపరీతంగా రావడంతో తాము అనారోగ్యానికి గురవుతు

నాడు చీకట్లు.. నేడు వెలుగులు

- కుమార్తె వైద్యానికి బడా వ్యాపారి నుంచి అప్పు
- అప్పు తీర్చేందుకు పదేళ్లపాటు వెట్టిచాకిరి చేసిన కుటుంబం
- జనవరిలో అధికారుల దృష్టికి వెళ్లడంతో బయటపడిన కుటుంబం
- స్వచ్ఛంద సంస్థ, అధికారుల చొరవతో స్వేచ్ఛాయుత జీవనం


బాధితురాలు

సాక్షి, కడప : భారతదేశం 78వ స్వాతంత్య్ర దినోత్సవాన్ని జరుపుకుంటున్న వేళ మన హృదయాలు గర్వంతో ఉప్పొంగుతున్నాయి. అయినా ఇప్పటికీ కొందరు కార్మికుల జీవితాలు బందీలుగా సంకెళ్ల మధ్య కొనసాగుతున్నాయి. చిన్నారి అనారోగ్యం పాలు కావడంతో అరువుకు తెచ్చుకున్న అప్పు వారిని బందీలుగా చేసింది. 2013 నుంచి ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలోని కొండప్రాంతంలో బందీలుగా మారి వేధింపులు ఎదుర్కొన్నారు. ఎన్నో ఇబ్బందులు, మరెన్నో సమస్యల మధ్య నలిగిపోయి ఎట్టకేలకు ఈ ఏడాది జనవరిలో అధికారులు, జీవన్ జ్వాల సంస్థ చొరవతో బయట పడ్డారు.

స్వాతంత్య్రం వేళ... కాంతి రేఖలు

ఉమ్మడి వైఎస్సార్ జిల్లాకు చెందిన చిన్నక్క, వీరన్న (పేర్లు మార్చాం)లు ఒకనాడు తీవ్ర వేదనకు గురయ్యారు. కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగించే వీరి చిన్న పాపకు అనారోగ్య సమస్య తలెత్తడంతో డబ్బులు లేక ఒక బడా వ్యాపారవేత్తను సంప్రదించారు. 2013లో రూ. 10 వేలు తీసుకున్న ఈ కుటుంబం తిరిగి డబ్బు చెల్లించలేకపోవడంతో ఆ వ్యాపారవేత్త ఆ కుటుంబాన్ని తన ఆధీనంలో పెట్టుకున్నారు. అప్పటి నుంచి చిన్నక్క, వీరన్నలను బయటికి వెళ్లనీయకుండా వారితో వెట్టిచాకిరీ చేయిస్తూ వచ్చాడు. దీంతో వారు అక్కడే సతమతమవుతూ పనులు చేస్తూ గడిపారు. కూలి కింద అతి తక్కువ మొత్తం అందిస్తుండడంతో వారు అక్కడనే మగ్గిపోయారు. తర్వాత ఎలాగోలా చిన్నక్క తప్పించుకుని బయటికి వెళ్లి తన బంధువులకు విషయం చెప్పింది. దీంతో వారు అధికారులతోపాటు జీవన్ జ్వాల స్వచ్ఛంద సంస్థకు సమాచారం అందించారు. అందరూ కలిసి బందీగా ఉన్న వీరన్నను 2024 జనవరిలో విడిపించడంతో వీరు అక్కడి నుంచి విముక్తి పొందారు.

కుటుంబంలో ఆనందం

ప్రస్తుతం జిల్లాలోని ఒక ప్రాంతంలో పనిచేసుకుంటూ సొంతంగా సంపాదించుకుంటున్న చిన్నక్క, వీరన్నలు ఆనందంగా గడుపుతున్నారు. పిల్లలతోపాటు తాము సంతోషంగా కొత్త జీవితం గడుపుతున్నామంటే కారణమైన జీవన్ జ్వాల సంస్థకు, అధికారులకు వారు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు

- సబ్ కలెక్టర్ మేఘస్వరూప్
- ముగిసిన జవహర్ నవోదయ విద్యాలయం రీజినల్ అథ్లెటిక్స్ మీట్


రీజినల్ అథ్లెటిక్స్ మీట్‌లో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ మేఘస్వరూప్

మదనపల్లె సిటీ : క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని మదనపల్లె సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ అన్నారు. బుధవారం స్థానిక చిత్తూరు రోడ్డులోని జవహర్ నవోదయ విద్యాలయంలో రీజినల్ స్థాయి అథ్లెటిక్స్ మీట్ ముగింపు కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలన్నారు. ఆటలు ఆడటం వల్ల మానసికంగా ఉల్లాసంగా ఉంటారన్నారు. చదువుతో పాటు క్రీడలపై మక్కువ చూపాలన్నారు. ఒలపింక్స్‌లో ఇండియా తరపున ఆడిన క్రీడాకారులు ఘనత సాధించారన్నారు. ఇప్పటి నుంచి క్రీడల్లో ప్రతిభ చూపితే రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో రాణిస్తారన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గోవిందరావు, వైస్ ప్రిన్సిపాల్ వేలాయుధన్, క్రీడా ఉపాధ్యాయులు జి.సురేంద్రరెడ్డి, కొటాయి, అధ్యాపకుడు లక్ష్మినారాయణ తదితరులు పాల్గొన్నారు.

విజేతలు వీరే..

రీజినల్ స్థాయిలో జరిగిన అథ్లెటిక్స్ మీట్ పోటీల్లో 258 పాయింట్లతో కాసరగడ్ క్లస్టర్ మొదటి స్థానం, 180 పాయింట్లతో బళ్లారి క్లస్టర్ ద్వితీయ స్థానం, 162 పాయింట్లతో చిత్తూరు క్లస్టర్ తృతీయ స్థానంలో నిలిచాయి.

ఉత్తమ అథ్లెటిక్స్ వీరే..

అండర్-14 బాలుర విభాగంలో 400 మీటర్ల పరుగు పందెం, 600 మీటర్ల పరుగు పందెం, హైజంప్‌లో నివేద్ ఎస్ జేవీఎస్ పాల్‌ఖాడ్(కాసరగడ్ క్లస్టర్) 15 పాయింట్లతో మొదటి స్థానం కైవసం చేసుకున్నారు.

అండర్-14 బాలికల విభాగంలో 400, 600 మీటర్ల పరుగు పందెం, హైజంప్ విభాగాల్లో 15 పాయింట్లతో శ్రేయకురి జేవీఎస్ గదక్ (బళ్లారి క్లస్టర్) మొదటి స్థానంలో నిలిచారు.

అండర్-17 బాలుర విభాగంలో 100 ,200 మీటర్ల పరుగు పందెంలో జి.రాఘవేంద్ర జేవీఎస్ కర్నూలు (చిత్తూరు క్లస్టర్) 10 పాయింట్లతో మొదటి స్థానం దక్కించుకున్నారు.

అండర్-17 బాలిక విభాగంలో అనీషా.ఆర్, జేవీఎస్, పాల్‌ఖాడ్, కాసరగడ్ క్లస్టర్ లాంగ్‌జంప్, ట్రిపుల్ జంప్, 100 మీటర్లపరుగు పందెంలో 13 పాయింట్లు సాధించి మొదటి స్థానం దక్కించుకున్నారు.

అండర్-19 బాలుర విభాగంలో 400, 800 మీటర్ల పరుగుపందెం, హైజంప్ విభాగాల్లో అరుణ్ దాస్ ఎస్ జేవీఎస్, పాల్‌ఖాడ్, కాసరగడ్ క్లస్టర్ 15 పాయింట్లతో మొదటి స్థానం దక్కించుకున్నారు.

అండర్-19 బాలికల విభాగంలో 200 మీటర్ల పరుగుపందెం, లాంగ్‌జంప్, ట్రిపుల్ జంప్‌లలో ఆలీనా సెలిన్ థామస్ జేవీఎస్ కొట్టాయం, కొట్టాయం క్లస్టర్ 15 పాయింట్లతో మొదటి స్థానంలో నిలిచింది. విజేతలకు సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ మెడల్స్, సర్టిఫికెట్లు అందజేశారు. ఎంపికైన క్రీడాకారులు రాంచిలోని ఖేల్గావ్‌లో ఈనెల 28 నుంచి 30 వరకు జరిగే నవోదయ నేషనల్ పోటీల్లో పాల్గొంటారని ప్రిన్సిపాల్ గోవిందరావు తెలిపారు.

భవన నిర్మాణాలకు పటిష్టమైనది భారతి సిమెంట్


బీమా బాండ్లు అందజేస్తున్న టెక్నికల్ ఇంజినీర్లు చిన్న శ్రీకాంత్‌రెడ్డి, నాగేంద్ర, తదితరులు

పులివెందుల రూరల్ : అత్యుత్తమ నాణ్యతా ప్రమాణాలకు భారతీ సిమెంట్ పటిష్టమైందని భారతీ సిమెంట్ కంపెనీ టెక్నికల్ ఇంజినీర్లు చిన్న శ్రీకాంత్ రెడ్డి, నాగేంద్ర, సేల్స్ మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. రంగనాథస్వామి ఆలయ సమీపంలోని మైరా హోటల్ నందు 60 మంది బిల్డర్లు, మేస్త్రీలకు సిమెంట్ నాణ్యత, వినియోగంపై బుధవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతీ సిమెంట్ రోబోటిక్ టెక్నాలజీతో తయారవుతోందని, అల్ట్రా ఫాస్ట్ నాణ్యత కలిగి ఉంటుందన్నారు. ఇతర కంపెనీల సిమెంట్ ఐదు గంటల్లో సెట్ అయితే.. భారతీ అల్ట్రా ఫాస్ట్ రెండు గంటల్లోనే సెట్ అవుతుందన్నారు. చాలా ధృఢత్వాన్ని కలిగి, కట్టడాలు త్వరగా పూర్తవు

ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తికి గాయాలు

కలికిరి : ఆర్టీసీ బస్సు, ద్విచక్రవాహనం ఢీకొని యువకుడు తీవ్రంగా గాయపడిన సంఘటన కలికిరి పట్టణ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని గుట్టపాళెం గ్రామం చీకిరాల బర్నేపల్లికి చెందిన ఈశ్వరయ్య, రాజేష్‌లు కలికిరి నుంచి స్వగ్రామానికి ద్విచక్రవాహనంలో బయలుదేరారు. స్థానిక ఎల్లమ్మ ఆలయం వద్ద సోమల వైపు నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సు ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో యువకుడు ఈశ్వరయ్య కాలు విరిగి తీవ్ర రక్తగాయాలయ్యాయి. రాజేష్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. స్థానికులు వీరిని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈశ్వరయ్య పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం తిరుపతికి సిఫార్సు చేశారు.

ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణాను అరికట్టాలి

- జిల్లా కలెక్టర్ శ్రీధర్
- ఇసుక అక్రమ మైనింగ్ చేస్తే కఠిన చర్యలు: జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు


ఇసుక అక్రమ రవాణా తరలింపుపై ఎస్పీతో కలిసి సమీక్షిస్తున్న జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి: ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణాను కట్టుదిట్టమైన చర్యలతో అరికట్టాలని జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లాస్థాయి ఇసుక కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు, జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్‌లు పాల్గొన్నారు. జిల్లాలో ఇసుక స్టాక్ పాయింట్లు, ఇసుక మైనింగ్ పాయింట్లను తనిఖీ చేసేందుకు జిల్లాస్థాయి టాస్క్‌ఫోర్స్, డివిజన్ స్థాయి టాస్క్‌ఫోర్స్, మండలస్థాయి టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసినట్లు జిల్లా మైనింగ్ శాఖ అధికారి జిల్లా కలెక్టర్‌కు వివరించారు. జిల్లాలో ఉచిత ఇసుక పాలసీని అమలు చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు మాట్లాడుతూ అక్రమ మైనింగ్ లేదా అక్రమ రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో రాయచోటి ఆర్డీఓ రంగస్వామి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ ప్రసన్న కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పశ్చిమగోదావరి జట్టు ఘనవిజయం

కడప స్పోర్ట్స్ : కడప నగరంలో నిర్వహిస్తున్న ఏసీఏ అంతర్ జిల్లాల అండర్-19 మల్టీ డేస్ క్రికెట్ టోర్నమెంట్‌లో పశ్చిమగోదావరి జట్టు ఘన విజయం సాధించింది. కేఓఆర్ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో 268 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో బరిలోకి దిగిన పశ్చిమగోదావరి జట్టు 81.3 ఓవర్లలో 340 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులో ఓవర్‌నైట్ బ్యాట్స్‌మన్ నాగరేవంత్ 133 పరుగులు చేశాడు. నెల్లూరు బౌలర్లు లోకేష్ 5 వికెట్లు తీశారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన నెల్లూరు జట్టు 42 ఓవర్లలో 180 పరుగులకే ఆలౌట్ అయింది. జట్టులోని మన్విత్ రెడ్డి 42 పరుగులు, లోకేష్ 40 పరుగులు చేశారు. దీంతో పశ్చిమగోదావరి జట్టు 38 పరుగుల ఆధిక్యంతో విజయం సాధించింది.

విజయం దిశగా విశాఖ

వైఎస్ఆర్ఆర్-ఏసీఏ మైదానంలో నిర్వహిస్తున్న మ్యాచ్‌లో 356 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో రెండో రోజు బరిలోకి దిగిన విశాఖ జట్టు 132.5 ఓవర్లలో 480 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని యశ్వంత్ 72, దేవాశిష్ 72 పరుగులు చేశారు. కృష్ణా బౌలర్లు ఆదర్శ్ 5 వికెట్లు తీశారు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన కృష్ణా జట్టు రెండో రోజు ఆట ముగిసే సమయానికి 40 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 144 పరుగులు చేసింది. జట్టులోని ధనుష్ 38, వరుణ్‌సాత్విక్ 37 పరుగులు చేశారు. కాగా రెండోరోజు ఆట ముగిసే సమయానికి కృష్ణా జట్టు 336 పరుగుల వెనుకంజలో ఉంది.

పోటాపోటీగా చిత్తూరు, కడప మ్యాచ్..

కేఎస్ఆర్ఎం మైదానంలో నిర్వహిస్తున్న మ్యాచ్‌లో 293 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో బరిలోకి దిగిన చిత్తూరు జట్టు 116 ఓవర్లలో 365 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని బాలాజీ 79 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. కడప బౌలర్లు నాగకుల్లాయప్ప 6 వికెట్లు తీశారు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన కడప జట్టు రెండో రోజు ఆట ముగిసే సమయానికి 63 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 324 పరుగులు చేసింది. రోహిత్ 149 బంతుల్లో 31 ఫోర్లు, 4 సిక్సర్‌లతో 194 పరుగులు చేశాడు. రణదీర్‌రెడ్డి 83 పరుగులతో రాణించారు. చిత్తూరు బౌలర్లు సాయిహర్షిత్‌రెడ్డి 3 వికెట్లు తీశాడు.

వ్యక్తి ఆత్మహత్య

కడప అర్బన్ : కడప నగరంలోని టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో అగాడివీధికి చెందిన షేక్ కరీముల్లా(55) ఈ నెల 13న సాయంత్రం ఇంటిలో సీలింగ్ కొక్కేనికి నవారు వైరుతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కరీముల్లా ఆటో నడుపుతూ జీవించేవాడని, మద్యానికి బానిసగా మారి ఈ చర్యలకు పాల్పడ్డాడని పోలీసులు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి


యల్లారెడ్డి (ఫైల్)


బద్వేలు అర్బన్ : పట్టణంలోని నెల్లూరు రోడ్డులో గల ఓ లాడ్జిలో ఓ యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు చెన్నూరు మండలం నరసారెడ్డి పల్లె గ్రామానికి చెందిన పిల్లి యల్లారెడ్డి (36) కడప నగరంలో నివసిస్తూ నగరంలోని ఓ పెట్రోలు బంకులో పనిచేస్తూ జీవనం సాగిస్తుంటాడు. ఈయనకు భార్య శ్రావణితో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. అయితే సోమవారం బాకీ వసూలు విషయమై బద్వేలుకు వెళుతున్నట్లు ఇంట్లో చెప్పి బద్వేలుకు వచ్చాడు. అదే రోజు సాయంత్రం నెల్లూరు రోడ్డులోని లాడ్జిలో గది అద్దెకు తీసుకుని ఉన్నాడు. అయితే బుధవారం మధ్యాహ్నం గదిలో నుండి దుర్వాసన వస్తుండటంతో లాడ్జి యాజమాన్యం అనుమానంతో అర్బన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. అర్బన్ ఎస్ఐ రవికుమార్ సిబ్బందితో వచ్చి తలుపులు పగులకొట్టి లోపలికి వెళ్లి చూడగా యల్లారెడ్డి మృతి చెంది ఉన్నాడు. మృతుని బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అర్బన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

మద్యం దుకాణంలో చోరీ

పులివెందుల రూరల్ : పులివెందుల-కదిరి రోడ్డులోని ప్రభుత్వ మద్యం దుకాణంలో మంగళవారం రాత్రి చోరీ జరిగింది. దొంగలు రూ.4,23,160ల నగదు అపహరించారు. డీఎస్పీ మురళీనాయక్, ఎస్సై అనిల్ కుమార్ మద్యం దుకాణాన్ని పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు.

భారతీయ సన్నిహిత

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి


అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, ఐసీడీఎస్ అధికారులు

లక్కిరెడ్డిపల్లి : భారతీయ సన్నిహిత చట్టాలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని జిల్లా బాలల సంరక్షణ అధికారి రామలక్ష్మీ పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఆదర్శ పాఠశాలలో 8, 9, 10, 12వ తరగతుల బాలికలకు భారతీయ సన్నిహిత చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బాలికల సంరక్షణ కోసం కొత్త చట్టాలు ప్రవేశపెట్టాయన్నారు. బాలికలు బాగా చదువుకొని మంచి భవిష్యత్తును ఎంచుకోవాలన్నారు. బేటీ బచావో, బేటీ పడావో, మిషన్ శక్తి కార్యక్రమాలపై విద్యార్థినులు అవగాహన కలిగి ఉండాలన్నారు. బాలికలకు ఏవైనా ఇబ్బందులు కలిగినప్పుడు 1098 నెంబర్‌కు ఫోన్ చేసి రక్షణ పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కోమటిరెడ్డి శివశంకర్ రెడ్డి, ఐసీడీఎస్ సూపర్ వైజర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బీసీ స్టడీ సర్కిల్‌ను ఏర్పాటు చేయాలి


బీసీ సంక్షేమ సంఘం సమావేశానికి హాజరైన నాయకులు

రాయచోటి అర్బన్ : బీసీల సంక్షేమం, అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని రాయచోటి పట్టణంలో బీసీ స్టడీసర్కిల్‌ను ఏర్పాటు చేయాలని బీసీ సంక్షేమ సంఘం అన్నమయ్య జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఇడగొట్టు నాగేశ్వరరావు, ఇమాంతుల్లా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో బీసీల జిల్లాస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలో పోటీ పరీక్షలకు హాజరయ్యే నిరుద్యోగుల కోసం బీసీ స్టడీ సర్కిల్, అలాగే బీసీల సభలు, సమావేశాల నిర్వహణ కోసం బీసీ భవన్‌ను నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షుడు నరసింహాచారి, నాయకులు కె.వెంకటరమణ, పాలగిరి హబీబుల్లా, వీరబల్లి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.